


ముగిసిన సచివాలయ సిబ్బంది బదిలీల ప్రక్రియ

పార్వతీపురం, జూన్30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి చేపడుతున్న బదిలీల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. నిబంధనల ప్రకారం వెల్ఫేర్, అగ్రికల్చర్, ఏఎన్ఎం, ఇతర సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలోని 350 సచివాలయాలు ఉండగా.. సర్వే యర్లకు మొదటిగా స్థానచలనం కల్పించారు. ఇక ఉమ్మడిజిల్లాలో ఉన్న 535 మహిళా సంరక్షణ పోలీసులకు విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. కాగా స్థానచలనం పొందిన సచివాలయ సిబ్బంది అంతా పింఛన్ల పంపిణీ తర్వాత రిలీవ్ కానున్నారు.



ఎప్పుడొస్తాయో?

- మంజూరు కాని 15వ ఆర్థిక సంఘం నిధులు
- గ్రామాల్లో ముందుకు సాగని అభివృద్ధి పనులు
- పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్ల నిర్వహణకు అవస్థలు
- జిల్లాకు రూ. 23 కోట్ల వరకు బకాయిలు
- ఆశగా ఎదురుచూస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

త్వరలో నిధులు మంజూరు

పంచాయతీలకు త్వరలోనే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతాయి. ప్రస్తుతం పంచాయతీల్లో ఉన్న నిధులతో ప్రజలకు అవసరమైన పనులు చేపట్టొచ్చు.

- కొండలరావు, డీపీవో, పార్వతీపురం మన్యం

పార్వతీపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఇంకా మంజూరు కాలేదు. దీంతో వాటి పరిస్థితి దయనీయంగా మారింది. నిధుల్లేక పనులేవీ ముందుకు సాగడం లేదు. గత ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం పంచాయ తీలకు సుమారు రూ.10 కోట్లును విడుదల చేసింది. ఆ తర్వాత నిధు లేమీ మంజూరు కాకపోవడంతో పంచాయతీల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రభావం పడుతోంది. విద్యుత్‌శాఖతో పాటు మిగిలిన శాఖలకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. పారిశుధ్య పనులు, వీధిలైట్ల నిర్వహణ, బోర్లు మరమ్మతులకు ఇబ్బందులు తప్పడం లేదు. చెత్త సేకరణ కార్మికులకు సకాలంలో వేతనాలు అందడం లేదు. ప్రస్తుతం జోరుగా వర్షాలు కురుస్తున్నందున ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాల్సి ఉంది. లేకుంటే ప్రజలు రోగాలు బారిన పడే అవకాశం ఉంది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాల నిర్వహణ కూడా కష్టతరంగా మారింది. ఇటు వంటి పరిస్థితుల్లో కొన్నిచోట్ల సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులు సొంత డబ్బులతో, మరికొందరు అప్పులు చేసి పంచాయతీల్లో అత్య వసరపనులు చేపడుతున్నారు.

ఇదీ పరిస్థితి...

జిల్లాలో 451 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ఏడాది జూలై నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు

(మిగతా 7వ పేజీలో...)



అంగన్‌వాడీ కేంద్రాల్లో

అక్రమాలకు చెక్

- నేటి నుంచి ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం అమలు
- పారదర్శక సేవలకు శ్రీకారం
- నకిలీ లబ్ధిదారుల తొలగింపే లక్ష్యం
- కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు



రాజాం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలకు దిగింది. కేంద్రాల నుంచి నెలనెలా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే సమయంలో ఫేషియల్ రికగ్నిషన్ (ముఖ ఆధారిత గుర్తింపు) తప్పనిసరి చేసింది. నేటి నుంచి అమలుచేయాలని స్పష్టం చేసింది. ఇందుకోసం ఇప్పటికే పోషణ్ ట్రాకర్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకత పెంచేందుకు, అర్హులకు పౌష్టికాహారం అందేందుకు, నకిలీ లబ్ధిదారుల్ని తొలగించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్రాల ద్వారా ఏం పంపిణీ చేశారో నేరుగా లబ్ధిదారు సెల్‌కు సమాచారం వచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. కేంద్రాలకు వచ్చేవారికి తప్పనిసరిగా ఉదయం, సాయంత్రం ముఖ ఆధారిత గుర్తింపు హాజరు తప్పనిసరి చేసింది. ఎంతమంది లబ్ధిదారులు వచ్చారో సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

రీ సర్వే తప్పులు..

పథకాలకు దూరం

- గత వైసీపీ సర్కారు తప్పిదం.. పేదలకు శాపం
- సమస్య పరిష్కరించాలని కలెక్టరేట్‌లో వినతుల వెల్లువ

పార్వతీపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే రైతులకు శాపంగా మారింది. మరికొంత మంది పేదలను సంక్షేమ పథకాలను దూరం చేసింది. గతంలో పాస్‌పుస్తకాలు కూడా చూడకుండా రీ సర్వే చేపట్టారు. తప్పులు తడకలగా రికార్డులు నమోదు చేశారు. భూమి ఉన్నవారికి లేనట్టు.. లేని వారికి ఉన్నట్టు.. మరికొందరికి అధికంగా భూములున్నట్లు చూపారు. అయితే వాటిని సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించినప్పటికీ గత వైసీపీ నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. తాజాగా సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ ఎస్‌లో అత్యధికులు భూ సమస్యలపైనే అర్జీలు ఇచ్చారు. తనకున్న భూమికి అదనంగా మరికొంత జోడిస్తూ.. రికార్డులో అధికంగా నమోదు చేయడంతో ప్రభుత్వ పథకాలకు దూరమయ్యామని గరుగుబిల్లి మండలం కొత్తూరు రెవెన్యూ పరిధిలో ఉన్న బర్ల రాంబాబు తెలిపారు. తనకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందించారు. అధికంగా భూమి ఉందని రికార్డుల్లో చూపించడం వల్ల తన మనవడు కార్తీక్‌కు 'తల్లికి వందనం' వర్తించలేదని సీతంపేట మండలం వెలగపురం గ్రామానికి చెందిన కొండగొర్రె జడ్డెయ్య వాపోయాడు. ఇలా ఎంతోమంది అధికారులకు వినతిపత్రాలు అందించారు. గతంలో చేపట్టిన రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేయాలని విజ్ఞప్తి చేశారు.



వినతులు ఇచ్చేందుకు

పిల్లలను వెంటబెట్టుకొస్తారా?

- వారికి ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులు..
- ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్

పార్వతీపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వినతులు ఇచ్చేందుకు పిల్లలను వెంటబెట్టుకొస్తారా? వారికి ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ప్రశ్నించారు. విద్యార్థులను పాఠశాలలకు పంపించకుండా తల్లిదండ్రులతో కలిసి పీజీఆర్ఎస్‌కు తీసుకొచ్చిన ఓ వ్యక్తిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బడి విషయమై ఇటీవల బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చిన విషయం తెలిసిందే. వారు తిరుగుపయనమైన సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై క్షతగాత్రులుగా మారారు. ఈ క్రమంలో సోమవారం కలెక్టరేట్‌కు పిల్లల్ని తీసుకొచ్చిన వారిపై కలెక్టర్ మండిపడ్డారు. వీరఘట్టం మండలం బెజ్జి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కొంతమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వెంటబెట్టుకొని సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు వచ్చారు. తమ గ్రామం నుంచి తలవరం వెళ్లేందుకు పిల్లలకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. తమ ఊరిలోనే మూడు నుంచి ఐదు వరకు తరగతులు నిర్వహించాలని కోరారు. అయితే ఈ సమస్య చెప్పేందుకు పిల్లలను ఎందుకు వెంటబెట్టుకుని వచ్చారని కలెక్టర్ ప్రశ్నించారు. తల్లిదండ్రులు లేదా గ్రామస్థులెవరైనా వచ్చి సమస్యను చెబితే పరిష్కరిస్తాం కదా! అని తెలిపారు. సుదూర గ్రామాల నుంచి పిల్లలను తీసుకుని వినతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావడం ఎంతవరకు సమంజమన్నారు. మార్గమధ్యంలో వారికి ఏదైనా జరిగితే పరిస్థితేమిటని అడిగారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పాఠశాలలను ఏర్పాటు చేస్తున్న విషయాన్ని తల్లిదండ్రులు కూడా అర్థం చేసుకోవాలని కోరారు. ఇకపై పిల్లలను కలెక్టరేట్‌కు తీసుకురావొద్దని, తప్పనిసరిగా పాఠశాలకే పంపించాలని సూచించారు. కాగా ఈ అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందించాలని విద్యాశాఖాధికారులను ఆయన ఆదేశించారు.



పీజీఆర్ఎస్‌కు పిల్లల్ని తెచ్చిన వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం..

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనమవుతుందని, ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు కుటుంబాలు, ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి. ఆర్థికంగా కూడా ఇబ్బందులు తప్పవు. వాటి అనర్థాలపై అవగాహన అవసరం. ప్రతిఒక్కరూ యోగా , వ్యాయామంపై దృష్టి సారించాలి. పాఠశాలలు, వసతిగృహాల చుట్టుపక్కల ఎటువంటి విక్రయాలు, కార్యకలాపాలు జరగకుండా పటిష్ఠ నిఘా పెట్టాలి. ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించాలి. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని సారా కేంద్రాలపై దాడులు జరపాలి. వివిధ రూపాల్లో మాదక ద్రవ్యాల విక్రయాలు సాగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలి. దీనిపై ఎటువంటి సమాచారం ఉన్నా ప్రజలు 1972 నెంబర్‌కు ఫోన్ చేయాలి.' అని తెలిపారు. ఎస్పీ మాధవరెడ్డి, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా రవాణాధికారి దుర్గాప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కె.సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల పంజా

- సీతంపేట సీహెచ్‌సీకి రోగుల తాకిడి
- మలేరియా కేసులే అధికం

సీతంపేట రూరల్, జూన్30(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో జ్వరాలు పంజా విసురుతున్నాయి. గత కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఏ గ్రామంలో చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. ఒక్కో ఇంట్లో ఒక్కరు లేక ఇద్దరు బాధితులు ఉంటున్నారు. ఎక్కువగా మలేరియా పాజిటివ్ కేసులు నమోదవుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. సోమవారం సీతంపేట ఏరియా ఆసుపత్రిలో 318 వరకు ఓపీ నమోదైంది. వారిలో 90 మంది జ్వరపీడితులు ఉన్నారు. మలేరియా ఆర్‌డీటీ పాజిటివ్ 26, స్లైడ్ పాజిటివ్ 3 కేసులు వచ్చాయి. 46మంది ఇన్‌పేషెంట్లుగా చేరి వైద్యసేవలు పొందుతున్నారు. ఏరియా ఆసుపత్రి పై అంతస్తులో చిన్నారులు, మహిళల కోసం ప్రత్యేకంగా ఓ వార్డును వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో రోగులకు కొంత మేర వసతి సమస్య తీరింది.



సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

పీఏసీఎస్‌లకు

త్రిసభ్య కమిటీలు

- ఈ నెలలోనే ఉత్తర్వులు ఇవ్వనున్న ప్రభుత్వం

విజయనగరం, జూన్30(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)కు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు కానున్నాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో ఉన్న 94 వ్యవసాయ పరపతి సంఘాలకు కమిటీలు రానున్నాయి. ఎవరెవరికి పదవులు ఇవ్వాలన్న దానిపై ఇప్పటికే ఎమ్మెల్యేలు జాబితాలు ఇచ్చారు. క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుని వాటిని సిద్ధం చేశారు. వైసీపీ హయాంలో అస్తవ్యస్తంగా మారిన సొసైటీలను గాడిన పెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో సొసైటీల్లో జరిగిన అవకతవకలకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలనుకుంటోంది. ప్రతి పీఏసీఎస్‌కి ఒక చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులు ఉంటారు. వీరి ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల సీఈవో, కార్యదర్శులు పనిచేస్త్తారు. ఎన్నికలు జరిగే వరకూ సహకార సంఘాలకు త్రీ సభ్య కమిటీలే కొనసాగనున్నాయి. ఈ నెలలోనే కమిటీలు కొలువుతీరనున్నాయి.

జగన్నాథుడికి ఘనంగా పూజలు 8వ



ఏజెన్సీలో కేంద్ర బృందం పర్యటన
ఐదేళ్ల బిల్లు ఎలా చెల్లించగలం? 7లో
కదలవు.. వదలవు
• నాలుగు రోజులుగా ఒకేచోట ఏనుగుల తిష్ట 8లో



ప్రతిపాదనలకే పరిమితం

- జంఝావతి నుంచి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు అందని నీరు
- దృష్టి సారించని అధికారులు
- ఆందోళనలో ఖరీఫ్ రైతులు

గరుగుబిల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జంఝావతి ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా అన్నది ప్రతిపాదనలకే పరిమితమవుతుంది. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ముమ్మరంగా వరి నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. అయితే ఏటాలానే ఈ సారి కూడా సాగునీటి ఇక్కట్లు తప్పేలా లేవని వారు మథన పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జంఝావతి నుంచి గరుగుబిల్లి, పార్వతీపురం, సీతానగరం, మక్కువ, కొమరాడ మండలాల పరిధిలోని 75 గ్రామాలకు సుమారు 26,640 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. మక్కువ మండలం మినహాయించి మిగిలిన నాలుగు మండలాల్లో ప్రస్తుతం 9 వేల ఎకరాలకే ప్రాజెక్టు నుంచి సాగునీరు అందుతుంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పెండింగ్ పనులేవీ పూర్తికాలేదు. మరోవైపు ఒడిశాతో సమస్య కూడా పరిష్కారం కాలేదు. నిధుల సమస్య కారణంగా గత కొన్నాళ్లుగా కాలువల పనులేవీ చేపట్టలేదు. వాటి నిర్వహణను గత ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రస్తుతం కాలువలు గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో నిండాయి. ప్రధాన కాలువలు కూడా అధ్వానంగా మారాయి. వాటి ద్వారా సాగునీరందకపోవడంతో పంట పొలాలు బీడుగా దర్శనమిస్తున్నాయి. కొన్నాళ్లుగా గరుగుబిల్లి, సీతానగరం, పార్వతీపురం మండలాల రైతులు సాగునీటికి పడరాని పాట్లు పడుతున్నారు. ఖరీఫ్‌కు ముందు కాలు వలను పూర్తిస్థాయిలో శుభ్రపరిస్తే కొంతమేర

(మిగతా 7వ పేజీలో...)



సీతారాంపురం వద్ద జంఝావతి కాలువ ఇలా..

మొదటి వారంలో సాగునీరు విడుదల

జంఝావతి ప్రాజెక్టు నుంచి జూలై మొదటి వారంలో సాగునీరు విడుదల చేయనున్నాం. ఉపాధి హామీ పథకంలో భాగంగా కొన్ని మండలాల్లో కొంతమేర కాలువలను బాగు చేశాం. పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించాం. నిధులు, అంతర్రాష్ట్ర సమస్యల కారణంగా పనుల నిర్వహణకు ఆటంకం నెలకొంది.

- పి.శ్రావణి, జేఈ, జంఝావతి ప్రాజెక్టు

రాకపోకలు సాగించేదెలా?

● కనీస మరమ్మతులకు నోచుకోని రహదారులు
● వాహనదారులకు తప్పని ఇబ్బందులు



కంచేరు-ముక్కాం రోడ్డు దుస్థితి

భోగాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో స్థానికులు, వాహనదారులు అవస్థలకు గురవుతున్నారు. కంచేరు నుంచి ఎర్రముసలయ్యపాలెం మీదుగా ముక్కాం వైపు వెళ్లే రహదారి, కంచేరు నుంచి బమ్మిడిపేట మీదుగా ముంజేరు వైపు వెళ్లే రహదారులు గోతులమయంగా ఉన్నాయి. చాన్నాళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడమే ఇందుకు కారణం. చిన్నపాటి వర్షం కురిసినా రహదారి గోతుల్లో నీరు చేరుతోంది. వాహనదారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.



బమ్మిడిపేటకు వెళ్లే రోడ్డు ఇలా..

తాగునీటికి అవస్థలు

భోగాపురం, జూన్30 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలో స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో రక్షిత తాగునీటి పథకం ఉన్నప్పటికీ స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు. కుళాయిల నుంచి సన్నని ధారగా తాగునీరు వస్తుండటంతో స్థానికుల నీటి అవసరాలు తీరడంలేదు. అదీ ఒకటి, రెండు బిందెలకు మించి నీరు సరఫరా కాకపోవడంతో బోరుబావులను ఆశ్రయిస్తున్నారు.



బోరు నుంచి నీరు తీసుకెళ్తున్న చిన్నారి

బాధితుల సమస్యలను పరిష్కరించాలి

విజయనగరం క్రైం, జూన్30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీస్‌స్టేషన్ల పరిధిలో బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన 34 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి వారం రోజుల్లో తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ సుధాకర్, ఎస్‌ఐ రాజేశ్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

రాజాం, జూన్30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన ప్రధాన పంప్ హౌస్ వద్ద విద్యుత్ పరికరాలు పాడవ్వడంతో ఆదివారం రాత్రి నుంచి తాగునీటి పంపింగ్ ఆదివారం రాత్రి నుండి నిలిచింది. దీనివల్ల మున్సిపాలిటీలో సోమవారం నీటి సరఫరా జరగలేదు. ఇంజనీరింగ్ సిబ్బంది నిరవధిక సమ్మెలో ఉన్నప్పటికీ వాటి మరమ్మతులు చేపట్టి మంగళవారం కొన్ని వార్డులకు తాగునీరు అందించే ఏర్పాటు చేస్తామని ఏఈ వెంకటరామరాజు తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత

దత్తిరాజేరు, జూన్30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల రక్షణ కోరుతూ జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని వీఆర్‌ఏలు తెలిపారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో డీటీ రత్నకుమారికి వారు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ సంఘ నాయకులు ఎస్.సింహాచలం, టి.పైడిరాజు, ఎం.శంకరరావు, కె.బంగార్రాజు, వై.ఎరుకునాయుడు, సీహెచ్.బాలయ్య, జనార్దన, గురువులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు

భోగాపురం, జూన్30 (ఆంధ్రజ్యోతి) ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సోమవారం మండలంలోని ముక్కాంలో ఇంటింటికీ కుళాయిలకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యను గుర్తించి కుళాయిల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకుడు ప్రసాద్ లోకం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వైకుంఠనాయుడు, డిప్యూటీ ఎంపీడీవో గాయత్రి, కార్యదర్శి మదీనా వల్లి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోండి

శృంగవరపుకోట, జూన్30 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దురుసుగా ప్రవర్తించిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జర్నలిస్టు సంఘ సభ్యులు కోరారు. సోమవారం తహసీల్దార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. విజయనగరంలో జర్నలిస్టు నాయుడుపై ఎస్‌ఐ మురళీ దురుసుగా ప్రవర్తించారన్నారు. దానిపై విచారణ నిర్వహించాలని కోరారు.

మంత్రుల దృష్టికి బొబ్బిలి ప్రాంత సమస్యలు

బొబ్బిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రాంత సమస్యలను స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం అమరావతిలో రాష్ట్ర మంత్రులను కలిసి నివేదించారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కలిసి వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ కాలువల అభివృద్ధిపై చర్చించారు. పాత బొబ్బిలి నుంచి మక్కువ ప్రాంతానికి వెళ్లే రహదారి పనులన్నింటికీ నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

వేణుగోపాలస్వామి భూములపై..

రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే బేబీనాయన కలిసి, బొబ్బిలి వేణుగోపాల దేవస్థానానికి సంబంధించిన అజ్జాడ భూముల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీర్ణావస్థలో ఉన్న పలు దేవాలయాలకు ఇతర అభివృద్ధి పనులకు సీజీఎఫ్ నిధులను మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ధూపదీప, నైవేద్య నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు. సీనియర్ నేత అల్లాడ భాస్కరరావు ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా గోపాలరాజు



ప్రమాణస్వీకారం చేసిన ఏఎంసీ పాలకమండలి

గజపతినగరం, జూన్30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో సోమవారం ఉదయం ఏఎంసీ చైర్మన్‌గా పి.వి.వి.గోపాలరాజు ప్రమాణస్వీకారం చేపట్టారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గౌరవ అధ్యక్షుడిగా ఏఎంసీ చైర్మన్‌తో సంతకం చేయించారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడిగా కోరాడ కృష్ణతో పాటు 14 మంది డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావుతో పాటు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నేతలు అసెంబ్లీకి వెళ్లకపోవడం బాధాకరం

● గజపతినగరం, జూన్30 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతలు అసెంబ్లీకి వెళ్లకపోవడం బాధాకరమని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్‌గా పి.వి.వి. గోపాలరాజు ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య చరిత్రలో ప్రతిపక్ష నేతలు సభలకు హాజరు కాకపోవడం బాధగా ఉన్నప్పటికీ, అసెంబ్లీలో బూతులు వినే పరిస్థితి తప్పినందుకు సంతోషిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏఎంసీలపై పర్యవేక్షణ లోపించడంతో రైతులు చితికి పోయారన్నారు. ప్రస్తుత ఏఎంసీ పాలకులు వారిని దృష్టిలో పెట్టుకుని పాలన సాగించాలని సూచించారు.

విద్యార్థులను ఆదుకుంటాం



పరుపులను అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస, జూన్30 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన విద్యార్థులను అన్నివిధాలుగా ఆదుకుంటానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండంలోని కంటకాపల్లిలో గల శారదా కర్మాగారం యాజమాన్యం సీఎస్‌ఆర్ నిధులతో సమకూర్చిన 70 పరుపులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించానన్నారు. విద్యార్థినులను చూసిన తర్వాత మనసు కలచి వేసిందన్నారు. విద్యార్థినులు నష్టపోయిన ప్రతి వస్తువును సమకూర్చడానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో శారదా కర్మాగార ప్రతినిధులు సన్యాసిరావు, శంకరరావు, ప్రిన్సిపాల్ విజయకుమారి, టీడీపీ నాయకులు కోళ్ల వెంకటరమణ, ఎం.సీతారామపాత్రుడు, కొరుపోలు అప్పారావు, పీవీ రత్నాజీ, గొంప దుర్గాఉమేష్, లెంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

భోగాపురం, జూన్30 (ఆంధ్రజ్యోతి): ముంజేరు సమీపంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ముగ్గురు బాధితులకు రూ.4.5 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లోకం నాగమాధవి పంపిణీ చేశారు. గూడెపువలస గ్రామానికి చెందిన సరగడ రామదాసుకు రూ.2.20 లక్షలు, చినరావాడ గ్రామానికి చెందిన బమ్మిడిసూరికి రూ.62వేలు, రావాడ గ్రామానికి చెందిన గొంప సాగర్‌కు రూ. 1.63 లక్షల చెక్కులు అందజేశారు.

పెండింగ్ సమస్యలపై దృష్టిపెట్టండి

జామి, జూన్30 (ఆంధ్రజ్యోతి): మండలంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అంబేడ్కర్‌ను జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండారు పెదబాబు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు కమర్షియల్ భూములు, తాటిపూడి కాలువ ద్వారా పంట పండించే భూములు రైతులు ఇచ్చారన్నారు. దాంతో వారు ఎంతో నష్టపోయారన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడి 30 శాతం అదనపు పరిహారం ఇప్పించాలని కోరారు. జామికి శ్మశానవాటిక లేదన్నారు. చాలా వరకు భూ ఆక్రమణలు ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు. జామి అగ్రహారం రైతుల కు 1-బి పాసు పుస్తకాలను ఇప్పించాలని పెదబాబు కోరారు.

కోండ్రుపై విమర్శలు అర్థరహితం

రాజాం రూరల్, జూన్30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌పై కొంతమంది వైసీపీ నాయకుల ఆరోపణలు అర్థరహితమని టీడీపీ విజయనగరం లోక్‌సభ బీసీ అధికార ప్రతినిధి మరిపి జగన్మోహన్ రావు అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజాంలో సుమారు రూ.7 కోట్ల మేర రెండో విడత రహదారి విస్తరణ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్‌కు ఒక్క రూపాయి కూడా చెల్లించని వైసీపీ నాయకులు కోండ్రును విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించడమేన్నారు. గత ఐదేళ్లలో నియోజక వర్గంలో వైసీపీ హయాంలో చేసిన అభివృద్ధి, ఏడాదిలో కోండ్రు చేపట్టిన అభివృద్ధిపై చర్చకు రావాలని అని జగన్మోహన్ సవాల్ విసిరారు.

విద్యాభివృద్ధికి సహకారం

వేపాడ, జూన్30 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి సహకరించడమే కృష్ణ విద్యా సంకల్పం ఉద్దేశమని సంస్థ ప్రతినిధులు ముక్కా రామకృష్ణ, పరవాడ జగదీశ్ తెలిపారు. సోమవారం మండలంలోని కొండగంగుబూడి పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులకు, బంగారయ్యపేటలో 18 మందికి, ఎస్.కోట సీతారాంపురంలో 9 మందికి, చినదుంగాడలో 25 మందికి, కడకొండ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు 500 నోట్ బుక్స్, 500 పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బానాది ఎంపీటీసీ సభ్యురాలు గొంప తులసి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, గిరిజన నాయకుడు కొప్పల అప్పారావు పాల్గొన్నారు.

పెణసాంలో వైద్య శిబిరం

గంట్యాడ, జూన్30 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెణసాం గ్రామంలోని నేచర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. ఈ సందర్భంగా 163 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలోని వైద్యులు అంబల్ల లహరి, అఖిల్‌కుమార్, నేచర్ సంస్థ కో-ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యాదానం మహాదానం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, జూన్30 (ఆంధ్రజ్యోతి): విద్యాదానం మహాదానమని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అందుకు తగట్టు మండలంలోని కెంగువ గ్రామస్థులు పాఠశాల భవన నిర్మాణానికి భూమి ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. రౌండ్ టేబుల్ వీఆర్‌టీ 77 సంస్థ రూ.55 లక్షల వ్యయంతో కెంగువలో నిర్మించిన పాఠశాల భవనాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల భవన నిర్మాణానికి స్థలం లేకపోవడంతో ఎస్సీ కులస్థులు వినియోగిస్తున్న స్థలాన్ని వారు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఎన్నికల సమయంలో పాఠశాల భవనం నిర్మాణం చేపడతానని ఇచ్చి హామీ మేరకు రౌండ్ టేబుల్ సంస్థ సహకారంతో 4 నెలల్లోనే భవనం నిర్మాణం చేయించామన్నారు. అలాగే పాఠశాలకు ప్రహరీ, పిల్లలకు ఆట సామగ్రి అందజేస్తానన్నారు. పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు రూ.10 లక్షలు విరాళం అందించడానికి ముందుకు వచ్చిన అచ్చెన్నాయుడును ఆయన అభినందించారు. వీఆర్‌టీ సంస్థ కంప్యూటర్ ల్యాబ్, సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు ముందుకు రావడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో మోహనరావు, ఎంఈవోలు విమలమ్మ, బి.సాయి చంద్రశేఖర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ దుష్యంత్, మధుసూదన్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కౌన్సిలర్లు రాజకీయాలు చేస్తున్నారు

● నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, జూన్30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీకి చెందిన టీడీపీ కౌన్సిలర్లు ప్రతీ విషయాన్ని రాజకీయం చేస్తున్నారని, ప్రతిపక్ష పార్టీ నేతల్లా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ధ్వజమెత్తారు. నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమెతో పాటు చైర్‌పర్సన్ బంగారు సరోజిని, జనసేన కౌన్సిలర్లు జానా సంధ్యారాణి, పాండ్రంకి మహాలక్ష్మి, బీజేపీ కౌన్సిలర్ షైపాడ ప్రసాద్ మాత్రమే హాజరయ్యారు. టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు ఎవరూ హాజరుకాలేదు. దాంతో సమావేశం రద్దయింది. ఈ సందర్భంగా హాజరైన కౌన్సిలర్లు, జనసేన పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. టీడీపీ కౌన్సిలర్లు రాజకీయాలు చేయడం తగదన్నారు. సమావేశం అజెండా నచ్చకపోతే దానిపై చర్చించాలన్నారు. అంతేగానీ కౌన్సిల్‌ను బహిష్కరించడం సరికాదన్నారు. కడప జిల్లాలో ఓ టీడీపీ ఎమ్మెల్యేపై అక్కడ వైసీపీ నాయకులు ప్రవరిస్తున్న విధంగా ఇక్కడ టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యుల తీరును ప్రభుత్వ పెద్దలకు తెలియజేస్తానన్నారు. ఇక్కడ పరిస్థితులను వివరిస్తానన్నారు. అలాగే అన్నా క్యాంటీన్‌లో జరుగుతున్న అవకతవకలను కూడా టీడీపీ అధిష్ఠానానికి తెలియజేస్తానన్నారు. స్పెషల్ అధికారిని నియమించి కౌన్సిలర్ల అధికారాలు తొలగింపునకు సిఫారసు చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

జగన్ ఆరోపణలు హాస్యాస్పదం

విజయనగరం రూరల్, జూన్30 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈసెట్ కౌన్సెలింగ్ విషయంలో చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదమని తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎన్‌ఎస్‌ఎఫ్) ఖండించింది. సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు చీమల సంతోష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బెవర భరత్ మాట్లాడారు. జూలై మూడోవారం లోపు ఈ సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇందులో ఎటువంటి జాప్యం లేదన్నారు. ప్రభుత్వంపై బురద చల్లేందుకు జగన్మోహన్‌రెడ్డి చౌకబారు ఆరోపణలు చేయడం తగదన్నారు. ఐదేళ్లలో ఇంజనీరింగ్ విద్యను మూలకు చేర్చిన ఘనత జగన్‌దేనన్నారు. నాశనమైన విద్యా వ్యవస్థను గాడిన పెట్టే ప్రయత్నాలు ప్రస్తుత ప్రభుత్వం చేపడుతోందన్నారు. దాన్ని జీర్ణించు కోలేని జగన్ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో జాప్యం అంటూ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. డీఎస్సీ అంటూ నిరుద్యోగులను మోసం చేసింది ఎవరని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రి లోకేశ్‌పై విమర్శలు దిగడం ఘోరమన్నారు. వాటిని ఖండిస్తున్నామన్నారు.

ఎస్టీ కమిషన్‌ను కలిసిన నిర్వాసితులు



వినతిపత్రం అందజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట రూరల్, జూన్30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ నిర్వాసితులు సోమవారం విజయనగరంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావును కలిశారు. ఎంపీపీ సోమేశ్వరరావు, ఎస్.కోట సర్పంచ్ సంతోష్‌కుమారి, ఆదివాసి సంఘనేత అప్పలరాజు దొర ఆధ్వర్యంలో ఆయన్ని కలిసి తమ సమస్యను వివరించారు. హక్కుల కోసం పోరాటం చేస్తే వేధింపులు, కేసులు, దాడులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తమ ప్రాంతంలో పర్యటించి న్యాయం చేయాలని కోరారు.

కార్పొరేట్లకు కారుచౌకగా భూములు

విజయనగరం దాసన్నపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్‌లకు కారుచౌకగా భూములు ఇస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు ఆరోపించారు. సోమవారం అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణ కాలుష్యం లేకుండా ప్రజలకు ఉపాధి కల్పించే పరిశ్రమలకు సీపీఐ వ్యతిరేకం కాదన్నారు. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ నేటి కూటమి ప్రభుత్వాలు 20 ఏళ్లుగా కాగ్నిజెంట్, టీసీఎస్, జిందాల్ లాంటి కంపెనీలకు కారు చౌకగా భూములు కట్టబెడుతున్నారన్నారు. సమావేశంలో సీపీఐ నేతలు రమణ, బుగత అశోక్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఎనిమిది మేకల మృతి

మెంటాడ, జూన్30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టాడ గ్రామానికి చెందిన రెల్లబాబుకు మేకలపై కుక్కల దాడి చేశాయి. దాంతో ఎనిమిది మేకలు మృతి చెందాయి. తన కల్లంలో కట్టిన మేకలపై ఆదివారం రాత్రి కుక్కల దాడి చేశాయని బాధితుడు తెలిపాడు.

గిరిజనులకు సాగుపట్టాలివ్వండి

మెంటాడ, జూన్30 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా సాగు చేస్తున్న పోడు భూములకు సాగుపట్టాలు ఇవ్వాలని గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీ ల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు.

ఆశలను చిదిమేసిన బస్సు

● రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి



నాగమణి (ఫైల్)

కొత్తవలస, జూన్30 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివి కుటుంబాన్ని ఆదుకుంటుందని ఎన్నో కలలు కన్న ఆ తల్లి ఆశలు అడియాసలయ్యాయి. మరికొద్ది రోజుల్లో ఇంజనీరింగ్ చదువు పూర్తిచేయనున్న ఆ విద్యార్థినిని బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం మండలం కుమిలి గ్రామానికి చెందిన కుప్పిలి అప్పయ్యమ్మకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అప్పయ్యమ్మ భర్త చనిపోవడంతో కూరగాయలు అమ్ముకుంటూ పెద్ద కుమార్తె నాగమణిని విజయనగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చదివిస్తోంది. నాగమణి ప్రస్తుతం సీఎస్‌ఈ నాలుగో సంవత్సరం చదువుతోంది. మరికొద్ది రోజులలో చదువు పూర్తయితే నాగమణికి మంచి ఉద్యోగం వచ్చి కుటుంబాన్ని ఆదుకుంటుందని ఆమె ఎంతో ఆశపడింది. అంతలోనే ఈ తల్లి ఆశలు ఆవిరైపోయాయి. కుమార్తె నాగమణి ఆదివారం సాయంత్రం సింహాచలం వెళ్లే దారిలో ఉన్న ప్రహ్లాదపురం బంధువులు ఇంటికి వెళ్లింది. రాత్రికి అక్కడే ఉన్న నాగమణి సోమవారం ఉదయం అరుకు వెళ్లడానికి బంధువులతో సిద్ధమైంది. సోమవారం 10 గంటల సమయంలో బంధువులు అందరూ మోటార్ సైకిళ్లపై అరకు బయలుదేరారు. నాగమణి కూడా తన మేనమామ దాసరి కార్తీక్ స్కూటీ వెనుక కూర్చుంది. మండలంలోని మంగళపాలెం జంక్షన్ సమీపంలో వారి స్కూటీని కొత్తవలస నుంచి విశాఖ వెళుతున్న సిటీ బస్సు ఢీకొంది. దాంతో స్కూటీ వెనుక కూర్చున్న నాగమణి బస్సు చక్రం కిందపడి అక్కడక్కడే మృతి చెందింది. మేనమామ దాసరి కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. చేతికి అందివస్తుందనుకున్న కూతురు అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లి అప్పయ్యమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. నాగమణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఆసుపత్రికి తరలించారు.

తల్లిదండ్రులు మందలించారని..

● యువకుడి ఆత్మహత్య



రాజశేఖర్(ఫైల్)

భోగాపురం, జూన్30 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని తల్లిదండ్రులు మందలించారని భోగాపురంలోని తోట వీధికి చెందిన కదంబ రాజశేఖర్ (27) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ దుర్గాప్రసాద్ అందించిన వివరాల మేరకు.. తోట వీధికి చెందిన రాజశేఖర్ మద్యానికి బానిసయ్యాడు. అయితే ఇటీవల అతడి ఆరోగ్యం బాగులేకపోవడంతో తల్లిదండ్రులు కందంబ లక్ష్మి, శ్రీనివాసరావు ఆసుపత్రికి తీసుకువెళ్లి పరీక్షలు చేయించారు. మద్యం సేవిస్తే పూర్తిగా ఆరోగ్యం క్షీణిస్తుందని అక్కడ వైద్యులు తెలిపారు. అయినప్పటికీ రాజశేఖర్ మద్యం తాగడం మానలేదు. దాంతో వారం కిందట తల్లిదండ్రులు మందలించారు. నాలుగు రోజులుగా దిగులుగా ఉన్నాడు. అయితే సోమవారం తల్లిదండ్రులు బయటకు వెళ్లారు. దాంతో ఇంట్లో ఫ్యాన్‌కు రాజశేఖర్ ఉరి వేసుకున్నాడు. బయట నుంచి వచ్చిన తల్లిదండ్రులు.. ఆత్మహత్య చేసుకున్న కుమారుడిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి తల్లిదండ్రులు, చెల్లి ఉన్నారు. మృతుడు తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సీతానగరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన సీతానగరం మండలంలోని అప్పయ్యపేట సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. పార్వతీపురం పట్టణానికి చెందిన జి.రామారావు, బి.రాజులు బొబ్బిలి నుంచి పార్వతీపురం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. అప్పయ్యపేట సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రామారావు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. రాజుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ రాజేశ్ కేసు నమోదు చేశారు

యువకుడిపై కేసు నమోదు

గంట్యాడ, జూన్30 (ఆంధ్రజ్యోతి): దళిత యువతిని నమ్మించి మోసం చేసిన యువకుడిపై గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం ఎల్‌బీజీ నగర్‌కు చెందిన ఓ యువతి పట్టణంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తోంది. ఆమెను మండలంలోని నరవకు చెందిన జె.త్రినాథ్ యువకుడు ప్రేమించానని, పెళ్లి చేసుకుంటామని నమ్మించాడు. రెండేళ్ల వీరి ప్రేమ వ్యవహారాలు కొనసాగించారు. తుదకు పెళ్లి చేసుకోవ డానికి యువకుడు నిరాకరించడంతో దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాజాం రూరల్, జూన్30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలగవీధి శ్మశానం ఏరియాలో సోమవారం పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.22, 290 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

కూర్మయ్య చెరువును కాపాడండి

భోగాపురం, జూన్30 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారుల నుంచి చెరువును కాపాడి ప్రజలకు న్యాయం చేయాలని మండలంలోని తూడెం పంచాయతీకి చెందిన గాలి రాజారెడ్డి, దువ్వ అప్పన్న సమ్మంగి నరిసింగరావు కోరారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూడెం పంచాయతీ బసవపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 46లో సుమారు 10.82 ఎకరాల కూర్మయ్య చెరువును పలువురు ఆక్రమించి మామిడి మొక్కలు నాటారన్నారు. వారికి అనుకూలంగా చెరువులో మట్టి రహదారి కూడా నిర్మించారన్నారు. ఇందుకు తహసీల్దార్ రమణమ్మ సానుకూలంగా స్పందించారు. చెరువులో ఆక్రమణలపై చర్యలు చేపడతానన్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయండి

వేపాడ, జూన్30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం-ఆనందపురం ప్రధాన రహదారి అభివృద్ధిని పాలకులు గాలికి వదిలేయడం దారుణమని సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం వేపాడలో అదే రోడ్డుపై ఆయన మాట్లాడారు. ఈ రహదారి అభివృద్ధికి గత ప్రభుత్వం ఎన్‌డీబీ పథకం కింద రూ. 39 కోట్లు మంజూరు చేసిందన్నారు. అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ పనులను ప్రారంభించారన్నారు. ఏళ్లు గడిచినప్పటికీ పనులు పూర్తికాలేదన్నారు. దీంతో మండలంలోని 29 పంచాయతీల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించిన రోడ్డు పనుల పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు.

బీఎస్పీని బలోపేతం చేయండి

లక్కవరపుకోట, జూన్30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బహుజన సమాజ్‌వాది పార్టీని బలోపేతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బోని కృష్ణ తెలిపారు. సోమవారం బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దోని అప్పారావు ఆధ్వర్యంలో ఎల్.కోటలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జూలై 6న విజ యవాడలో రాష్ట్రస్థాయి సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యల్లపు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో లోపాలను సరిదిద్దండి

నెల్లిమర్ల, జూన్30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన భూసర్వేలో లోపాలను సరిదిద్ది రైతులకు మేలు చేయాలని వైస్ ఎంపీపీ, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ కోరారు. తహసీల్దార్ శ్రీకాంత్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రీసర్వే గ్రామాల్లో వన్‌బీ రాకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. వన్‌బీ రాకపోవడం వల్ల రైతులు తమ పంట రుణాలను రెన్యువల్ చేసుకోవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. రీసర్వే గ్రామాల్లో భూముల క్రయవిక్రయాలు చేయడానికి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

ఎప్పుడొస్తాయో?

(ఐదో పేజీ తరువాయి)

మంజూరు కావడం లేదు. మొత్తంగా రూ.23 కోట్ల మేర బకాయిలున్నట్లు తెలుస్తోంది. కాగా జిల్లాలో మేజర్ పంచాయతీల విషయానికొస్తే.. వాటికి ఇంటిపన్నులు లేదా ఇతర ఆదాయ వనరులు కాస్తోకూస్తో ఉంటాయి. దీంతో ఏదో ఒక విధంగా ప్రజలకు అవసరమైన అత్యవసర పనులు చేపట్టే వెసులుబాటు ఉంటుంది. మైనర్‌పంచాయతీల్లో మాత్రం పరిస్థితి వేరు. వాటి ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటుంది. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల పరిధిలో ఏదో ఒకటి రెండు పంచాయతీలు మినహా మిగిలిన గిరిజన గ్రామాలకైతే ఎటువంటి ఆదాయం ఉండదు. ఈ క్రమంలో ఆయా పంచాయతీలన్నీ 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

(ఐదో పేజీ తరువాయి)

సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యే అవకాశం ఉంది. అయితే ఆ దిశగా సంబంధిత అధికారులు పనులు చేపట్టలేదు. దీంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. వ్యవసాయ పనులకు సిద్ధమైన రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన కాలువలను బాగు చేసి శివారు ప్రాంత భూములకు సక్రమంగా సాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తే..

గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర పరిధిలో తోటపల్లి కుడి ప్రధాన కాలువ ప్రాంతంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తే సుమారు 5 వేల ఎకరాలకు పైబడి సాగునీరందే అవకాశం ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఎత్తిపోతల పథకానికి గ్రహణం పట్టింది. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఈ సమస్యను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభించాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి 'గ్రామీణ స్వరాజ్'

బొబ్బిలి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్ అభియాన్ పథకం ప్రవేశపెట్టారని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. సోమవారం బొబ్బిలి వెలుగు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల మహిళా సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు అందరూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసి, దాని ప్రకారం ప్రజల అవసరాలు గుర్తిం చి, ఆ మేరకు అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో బాపట్ల పంచాయతీరాజ్ శిక్షణా కేంద్ర ప్రతినిధి ఎస్.నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకపాత్ర పోషించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం

రామభద్రపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలం లో ప్రభుత్వ స్థలాలు, భూముల ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అజు రఫీ జాన్ హెచ్చరించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాల యంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఆక్రమణదారుల జాబితాలను సిద్ధం చేస్తున్నామని, వారికి నోటీసులు ఇస్తా మని తెలిపారు. అలాగే మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, ముఖ్యంగా వీఆర్వోల వద్ద ఎటువంటి పెండింగ్ కేసులు ఉంచరాదని సూచించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా కొండకెంగువ, కొట్టక్కి, తారాపురం, రామభద్రపురం గ్రామాల్లో ఎక్కువ గా సమస్యలు ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

బొబ్బిలి రూరల్: అవినీతికి పాల్పడిన రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.శ్రీను హెచ్చరించారు. సోమవారం బొబ్బిలిలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సిబ్బంది చిత్తశుద్ధితో నిజాయితీతో విధులు నిర్వహించాలన్నారు. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే జీవో నెంబరు 30 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో 2019 ముందు నిర్మాణం చేపట్టిన ఇళ్లకు క్రమబద్ధీకరణ చేయడానికి వచ్చిన దరఖాస్తులపై దర్యాప్తు చేయాలని ఆదేశించారు.

బొబ్బిలి మున్సిపల్ చైర్మన్‌కు అరుదైన ఆహ్వానం

బొబ్బిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబుకు అరుదైన ఆహ్వానం లభించింది. వచ్చే నెల 3, 4 తేదీలలో హర్యానాలోని గురుగ్రామ్‌లో పార్లమెంట్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది స్థానిక సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానం లభించింది. ఇందులో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్‌కు కూడా స్థానం లభించింది. 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణం లో స్థానిక సంస్థల పాత్ర' అనే అంశంపై జాతీయ స్థాయిలో రెండు రోజుల పాటు ఈ సదస్సు నిర్వహించనున్నారు.

పత్తి రైతులకు బకాయిలు చెల్లించాలి

పాలకొండ, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు వెంటనే బకాయిలు చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమంలో జేసీ శోభికకు వినతిపత్రం అందించారు. భామిని లోని కొనుగోలు కేంద్రానికి పత్తిని అమ్మిన మండలంలోని రైతులకు నేటికీ డబ్బులు చెల్లించలేదని ఆయన తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు ఎరుకమజ్జి లక్ష్మీనారాయణ, వైకుంఠరావు, రైతు సంఘం మండల కార్యదర్శి కొత్తకోట బాబూరావునాయుడు ఉన్నారు.

షట్టర్లు బిగించాలి

తోటపల్లి బ్యారేజ్ వద్ద పాత కుడి, ఎడమ కాలువలకు పాడైపోయిన షట్టర్లను బిగించాలని బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. స్పందించిన జేసీ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.. ఇంకెప్పుడు పనులు ప్రారంభిస్తారని ఈఈ పొన్నాడ సుధాకర్‌కు ప్రశ్నించారు. ఈఈ స్పందిస్తూ టెండర్ ప్రక్రియ ఆలస్యమైం దని, అయినా టెండర్లతో సంబంధం లేకుండా పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

జియ్యమ్మవలస, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో ఆర్.విజయభారతి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువుల డీలర్లతో ఆమె సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు విక్రయించేటప్పుడు రైతులకు రశీదు ఇవ్వాలన్నారు. డీలరు వద్ద స్టాక్ రిజిష్టర్, బిల్లు బుక్కు, ఈ-పాస్ మిషన్ ఉండాలన్నారు. షాపు ముందు ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జిల్లాలో ప్రవేశించిన గజరాజులు

ఒడిశా

రాయగడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాయగడ జిల్లా కోమట్లపేట, సూరి పంచాయతీ పరిధి ఫకిరి గ్రామ సమీపంలోని కంబేగూడ అటవీ ప్రాంతంలో మూడు గజరాజులు ప్రవేశించాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గజరాజులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అటవీ శాఖాధికారులు అవి సంచరిస్తున్న ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సూరి పంచాయతీతో పాటు ఫకిరి, ఖమాసింగ్, పోంగిలి తొటగుడ తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుంబికోట ప్రాంత అటవీ శాఖాధికారి కునా బెహరా తెలిపిన వివరాల మేరకు ఒక గున్న ఏనుగుతో పాటు మగ, ఆడ ఏనుగులు సంచరిస్తున్నాయి. ఏనుగులు సంచరిస్తున్న ప్రాంత గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖాధికారులు హెచ్చరికలు జారీచేశారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- పీజీఆర్ఎస్‌కు 112 అర్జీలు

పార్వతీపురం, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులకు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో కె.హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణితో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సాలూరు మండలం బంగారమ్మపేట గ్రామానికి చెందిన ఎ.సూర్యనారాయణకు, సీతానగరం మండలం ఇప్పలవలస గ్రామానికి చెందిన పి.కుమారస్వామికి చెవిటి మిషన్‌ను అందించారు. మొత్తం 112 అర్జీలు అందాయని తెలిపారు. సీతంపేట మండలం అంటికొండ, పెద్దగోడ గ్రామాల్లో అదనపు పాఠశాల భవనాలు మంజూరు చెయ్యాలని ఆయా గ్రామస్థులు అర్జీ అందించారు. గరుగుబిల్లి మండలం రావివలస ఎంపీపీ స్కూల్‌ను బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా కొనసాగించాలని బి.తిరుపతిరావు కోరారు. పాచిపెంట మండలం కేరంగి గ్రామానికి విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని సర్పంచ్ లచ్చయ్య దరఖాస్తు అందించారు. ఇలా అనేక సమస్యలపై ఫిర్యాదులు అందాయి. డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శుల వినతి

గ్రామ సచివాలయ కార్యదర్శులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. తాము ఎదుర్కొంటున్నా సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందించి కమిషనర్‌కు లేఖ రాస్తామని హామీనిచ్చారు.



పార్వతీపురం: సచివాలయ కార్యదర్శుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 72 వినతులు

సీతంపేట రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గిరిజనుల నుంచి 72 వినతులు వచ్చాయి. చొర్లంగి పీహెచ్‌సీ పరిధిలో సీహెచ్‌వో పోస్టు ఇప్పించాలని కోడూరుకు చెందిన ఆరిక నీలవేణి కోరింది. నాడు-నేడు పథకం కింద గతంలో చేపట్టిన నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లు మంజూరు చేయాలని ఆడంగి గాయత్రీ అనే మహిళ పీవోను కోరారు. తల్లికి వందన పథకం వర్తింపచేయాలని సవర మల్లమ్మ కోరగా నల్లరాయి గూడ గ్రామంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆరిక సురేష్ కోరారు. ఇలా అనేక సమస్యల పరిష్కారం కోరుతూ పీజీఆర్ఎస్‌ను గిరిజనులు ఆశ్రయించారు. పీవోతో పాటు ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, టీడబ్ల్యూ ఈఈ పీవీఎస్ఎన్ కుమార్, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన రావు, ఏవో వాహిణి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ శ్రీహరి, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సీతంపేటరూరల్: గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

నా కుమారుడిని ఆదుకోండి

తమ కుమారుడు పుట్టుకతో దివ్యాంగుడని, పింఛన్ మంజూరు చేయించి ఆదుకోవాలని నారాయణగూడ గ్రామానికి చెందిన గిరిజన తల్లిదండ్రులు సవర కూర్మారావు, లలితలు.. పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం తమ కొడుకు అబినిని ఎత్తుకుని గ్రీవెన్స్‌కు వచ్చారు. తన కుమారుడికి 11ఏళ్లు వచ్చినా తన పని తాను చేసుకోలేని స్థితిలో ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ మంజూరు చేయాలని వేడుకున్నారు. దీనిపై పీవో స్పందించి ఎంపీడీవో బీబీ మిశ్రోతో ఫోన్‌లో మాట్లాడి, దివ్యాంగుడికి పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



బెలగాం: ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

బెలగాం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం లేకుండా నిర్దేశించిన సమయంలో సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో 11 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ తెలిపారు. బాధితులు ఇచ్చిన వినతిపత్రాలను పరిశీలించారు. నిర్దిష్ట సమయంలో ఫిర్యాదులు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



సింహాచలం దంపతులను సత్కరిస్తున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తాను పనిచేసిన కాలంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. సీతంపేట ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన పి.సింహాచలం, కేవీ రమేష్‌లను పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో జి.చిన్నబాబులు సత్కరించారు. ఈసందర్భంగా వారి సేవలను పీవో కొనియాడారు. టీడబ్ల్యూ ఈఈ పీవీఎస్ఎన్ కుమార్, డీడీ అన్నదొర, డీఈ కృష్ణకుమార్, ఏఈలు నాగభూషణం, సింధుజ, శ్రీకాంత్, ఐటీడీఏ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సాలూరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సారా ప్యాకెట్లను తరలిస్తున్న వ్యక్తిని బాగువలస వద్ద పట్టుకుని, అరెస్ట్ చేశామని సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి సోమవారం చెప్పారు. నక్కడవలసకు చెందిన రామ్మోహన్ 230 సారా ప్యాకెట్లును తరలిస్తుండగా బాగువలస వద్ద పట్టుకున్నామన్నారు. సారా ప్యాకెట్లు, బైక్‌ను సీజ్ చేశామని చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పర్చామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో రూ.40 వేలు జరిమానా

తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు వాహనచోదకులను పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. వారిని కోర్టులో ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున నలుగురికి రూ.40వేలు జరిమానాను విధించారని చెప్పారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

పాలకొండ, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతి కార్యకర్తనూ ఆదుకుంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి అన్నారు. గుడివాడ గ్రామానికి చెందిన కోట రాంబాబు కృష్ణా జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. ఆ కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును ఆమె సోమవారం అందించారు. అరకు పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు వారాడ సుమంత్‌నాయుడు, ఏఎంసీ చైర్మన్ త్రినాథరావు, కోట విశ్వేశ్వరరావు, రామకృష్ణ మాస్టార్, మాజీ ఎంపీటీసీ జయలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదు, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బొడ్డవలసలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్స రంలో మిగులు సీట్లు భర్తీ చేయనున్నామని ప్రిన్సిపాల్ మూడడ్ల తిరుపతి రావు చెప్పారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఐదో తరగతి లోను, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో కొన్ని సీట్లు మిగిలి ఉన్నా యని చెప్పారు. వాటిలో ప్రవేశానికి బొడ్డవలసలో ఉన్న గురుకులానికి దరఖాస్తులు ఇవ్వాలన్నారు. అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖా స్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

కార్యదర్శులకు పనిభారం తగ్గించాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గరుగుబిల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.అర్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావులకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వీరు మా ట్లాడారు. ఉదయం 6 గంటల నుంచి పారిశు ద్య నిర్వహణ పనులకు హాజరు కావడం కష్టతరంగా ఉందని, వారంలో రెండు రోజులు పాటు ఈ విధుల నిర్వహణకు వెసులబాటు కల్పించాలని కోరారు. చెత్త సేకరణపై ఐవీఆర్ఎస్ కాల్స్ ఆధారంగా కార్యదర్శు ల పనితీరును బేరీజు వేస్తున్నారు. దీనిని ఉపసంహరించాలన్నారు. ఇలా అనేక సమస్యలతో సతమతం అవుతున్నామని, తమ డిమాండ్ల సాధనకు ఈనెల 4న నల్ల బ్యాడ్జీలతో నిరసన చేయనున్నట్టు వారు తెలిపారు. నిరసలకు స్పందించకుంటే 9న పెన్‌డౌన్ నిర్వహిస్తామని, సకాలంలో స్పందించకుంటే 15వ తేదీ నుంచి శాంతి యుత నిరసనలు చేపడతామని తెలిపారు.

ఐదేళ్ల బిల్లు ఎలా చెల్లించగలం?



ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడుతున్న రమణారావు

పాలకొండ, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): తొలుత కరెంట్ ఉచితమని ఐదేళ్ల బిల్లు అడగలేదు.. ఇప్పుడు అదంతా కట్టకపోతే కనెక్షన్ తీసేస్తామని చెప్పడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. ఈ మేరకు ఆయన సింగన్నవలస పంచాయతీ మల్లంగూడ గిరిజన కుటుంబాలతో కలిసి సోమవారం పాలకొండలోని ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయానికి చేరుకున్నారు. ఉద్యోగులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ప్రజలకు ఉచితంగా ఇచ్చిన ఐదేళ్ల కరెంట్ మొత్తానికి బకాయిలు పేరుతో ప్రభుత్వం కిరాతకంగా వసూలు చేయడం తగద న్నారు. మల్లంగూడలోని సవర మజ్జియ్యకు రూ.18,863, సవర చిన్నకు రూ.10,889, సవర సుక్కమ్మకు రూ.8,152 బిల్లులు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. తక్షణమే బిల్లులను రద్దు చేయాలని రమణారావుతో పాటు గిరిజన సంఘం నాయకులు భానుచందర్, మజ్జియ్య, చిన్నారావు, చెంప, సీఐటీయూ మండల కార్యదర్శి కాద రాము, లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు డిమాండ్ చేశారు.

శంకర మఠం భూమిని అప్పగించాలి

పార్వతీపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మండలం మొదటి కెల్ల రెవెన్యూ పంచాయతీ విక్రంపురం గ్రామంలోని శంకర మఠానికి చెందిన 23 సెంట్ల భూమిని అప్పగించాలని ఆ మఠానికి చెందిన సభ్యులు ఎం.హరినారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. 1959లో కొంతమంది దాతలు సర్వే నెంబరు 50/2లో 86 సెంట్ల భూమిని మఠానికి ఇచ్చారని చెప్పారు. అయితే గత ప్రభుత్వంలో కొంతమంది పెద్దలు రెవెన్యూ అధికారుల సహాయంతో రీసర్వే సందర్భంగా విక్రమపురం గ్రామంలోని శంకర మఠానికి చెందిన 23 సెంట్లు భూమిని అదే గ్రామంలో ఉన్న సీతారామస్వామి ఆలయం పేరున నమోదు చేశారని చెప్పారు. మఠానికి చెందిన భూమిని ఆలయం పేరున మార్చిన రెవెన్యూ అధికారులపై గతంలో అనేక సార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు.

వీవోఏ తొలగింపునకు చర్యలు

వీరఘట్టం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వెలుగు శాఖలో స్వయం సహాయక సంఘాల గ్రామ సంఘ సహాయకురాలిగా విధులు నిర్వహిస్తున్న దశమంతుపురం గ్రామానికి చెందిన పాలవలస లక్ష్మిని తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎం కె.రాము తెలిపారు. ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బులు రూ.లక్షా 91వేలను లక్ష్మి తమ సొంత అవసరాలకు వినియోగించుకుని, బ్యాంకులో జమ చేయలేదని దర్యాప్తులో తేలిందని ఆయన తెలియజేశారు. ఈ మేరకు ఆమెను విధుల నుంచి తొలగించాలని మండల సమాఖ్యకు తెలియజేశామని చెప్పారు.

పట్టపగలే వీధిదీపాల వెలుగులు

వీరఘట్టం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిమ్మి గ్రామంలో పట్టపగలు విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. ప్రభుత్వం విద్యుత్ పొదుపుగా వాడాలని ఎంత ప్రయత్నిస్తున్నా అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా పనిచేస్తున్నారు. గ్రామాల్లో వీధి దీపాలు 24 గంటలు వెలుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు అన్ని గ్రామాల్లోనూ వీధిలైట్లు ఉదయం పూట ఆర్పేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టపగలు వెలుగుతున్న వీధిదీపం

న్యూస్ బాక్స్

వీధి దీపాల ఏర్పాటు

మక్కువ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మక్కువలోని గంట్యాడ వీధి, జంగాల వీధి, బల్లంకి వీధి, రామిరెడ్డి వీధి, కర్లాల వీధుల్లో సోమవారం పాత బల్బుల స్థానంలో నూతన ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేశారు. సర్పంచ్ రామలక్ష్మి, పంచాయతీ కార్య నిర్వహణాధికారి శ్రీనివాసరావు పరిశీలించారు.

బెల్లపుఊట ధ్వంసం

జియ్యమ్మవలస, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి దళితవాడ పరిసర ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన దాడుల్లో 800 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామని చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని, త్వరలో నిందితుడిని పట్టుకుంటామని చెప్పారు. ఏఎస్ఐ పత్తిక కాసులు, హెచ్‌సీలు సోములు, శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

గరుగుబిల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. సోమవారం గరుగుబిల్లి, గొట్టివలస గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ అనే లింక్‌లతో పాటు పలు రకాల లింక్‌లను సెల్‌ఫోన్లకు పంపించి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. గ్రూపుల్లో వచ్చే లింక్‌లను ఓపెన్ చేయరాదని సూచించారు.

విద్యార్థుల నమోదు పెంచాలి

గరుగుబిల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని ఎంఈవో-1 సామల సింహాచలం అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్‌పై సీఆర్ఎంటీలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థుల నమోదును శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంఈవో-2 కొండలరావు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

సీపీవో సేవలు అభినందనీయం

పార్వతీపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రణాళికా అధికారి వీరరాజు సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. వీరరాజు పదవీ విరమణ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, వీరరాజు దంపతులను సత్కరించారు. డిప్యూటీ ఎస్‌వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోర్టికోలో కుర్చీల తొలగింపుపై రగడ

- వేడెక్కిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొబ్బిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో పోర్టికోలో ఏర్పాటు చేసిన కుర్చీలు, టేబుల్‌ను తొలగించడంపై వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో రగడ చేశారు. సోమవారం బొబ్బిలి మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని అంశాలన్నిటినీ చర్చించి ఆమోదించారు. వైసీపీ కౌన్సిలరు ఇంటి గోవిందరావు తొలుత ఈ కుర్చీల అంశాన్ని లేవనెత్తారు. పోర్టికోలో ఉండే కుర్చీలు, టేబుళ్లను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఆయనకు సీనియర్ కౌన్సిలర్లు కోట పెదరాములు, చోడిగంజి రమేష్‌నాయుడు, సవలాపురపు రామకృష్ణ తదితరులు మద్దతు తెలిపారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ పోర్టికోలో ప్రజలెవరూ కూర్చోవడం లేదు.. అదే పనిగా కొంతమంది రాత్రివేళల్లో కూర్చుంటూ మద్యం తాగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.. అందుకే కుర్చీల స్థానాలను మార్చామని సమాధానం ఇచ్చారు. కౌన్సిలర్లందరికీ పై అంతస్తులో చైర్మన్ చాంబర్ ముందు ప్రత్యేకంగా ఏసీ రూంను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో హంగులు కల్పించేందుకు రూ.5లక్షలు ఖర్చు చేశారని, దీనిని ప్రారంభించేటప్పుడు తమను ఆహ్వానించలేదని చోడిగంజి, ఇంటి విమర్శించారు. ఇది తమ ప్రివిలైజ్ అని, చట్టవిరుద్ధమైతే కోర్టుకు వెళ్లవచ్చని చైర్మన్ బదులిచ్చారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

పట్టణంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని, వాటర్ వర్క్స్ సిబ్బంది తమ ఫోన్లకు స్పందించడం లేదని వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మరికొంతమంది కౌన్సిలర్లతో పాటు చైర్మన్ కూడా ఆరోపించారు. మున్సిపల్ డీఈఈ కోరెడ్ల కిరణ్‌కుమార్, ఏఈ గుప్త వివరణ ఇచ్చారు. పబ్లిక్ టాయిలెట్స్, పారిశుధ్య నిర్వహణ తదితర వాటిపై చోడిగంజితో పాటు పలువురు కౌన్సిలర్లు సూచనలు చేశారు. ఈ సమావేశం లో కమిషనర్ లాలం రామలక్ష్మి, ఆర్వో నాగరాజు, ఆర్ఐ సురేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి, టౌన్‌ప్లానింగ్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో కౌన్సిలర్ల వాగ్వాదం


ఏకలవ్య పాఠశాలను పరిశీలించిన ఢిల్లీ బృందం

ఏజెన్సీలో కేంద్ర బృందం పర్యటన

గుమ్మలక్ష్మీపురం, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): ఢిల్లీకి చెందిన మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ బృందం సోమవారం గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పర్యటించింది. ఈ బృందానికి మోటా సెన్ అధికారి రాహుల్ ఖురానా నాయకత్వం వహించారు. ఈ బృందం మోటా నిధులతో పార్వతీపురం గిరిజన ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వసతుల కల్పన, భోజనం మెనూ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఏజెన్సీలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పీవీటీజీ లబ్ధిదారులకు మంజూరు చేసిన గృహాల నిర్మాణం తదితర పనులను పరిశీలించారు. ఈ బృందం వెంట ఐటీడీఏ ఏపీవో మురళి, పీఏవో శ్రీనివాస్, ఐటీడీఏ ఏఈ తిరుపతిరావు, భద్రగిరి టీడబ్ల్యూఏ అప్పారావు ఉన్నారు.

వినతుల పరిష్కారంపై దృష్టి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వచ్చే వినతుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతుల పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. అలాగే రీఓపెన్ కేసులపైన కూడా పూర్తిగా విచారణ చేపట్టి.. ముగించాలని ఆదేశించారు. సోమవారం వివిధ సమస్యలపై 172 వినతులు వచ్చాయి. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాస మూర్తి తదితరులు వినతులు స్వీకరించారు. వచ్చిన వినతుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 69 ఉన్నాయి. పంచాయతీరాజ్ 9, డీఆర్డీఏకు 15, మున్సిపాల్టీవి 12, విద్యాశాఖకు సంబంధించి 21, హౌసింగ్‌కు సంబంధించి 3, వైద్య ఆరోగ్య శాఖకు 4, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

బదిలీల్లో నిబంధనలు పాటించాలి..

సచివాలయాల సిబ్బంది బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని... ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలు అతిక్రమించరాదని కలెక్టర్ అంబేద్కర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ వినతుల స్వీకరణ అనంతరం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నిబంధనలు ప్రకారం బదిలీలు చేపట్టి నోటీసు బోర్డులో ప్రదర్శించాలని సంబంధిత అధికారులను సూచించారు. అభ్యంతరాలను స్వీకరించి... వాటిని కూడా పరిశీలించాలన్నారు. ఎటువంటి అక్రమాలు జరిగినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. 25 శాతం సీట్లను కేటాయించడానికి అంగీకరించని పాఠశాలలను వెంటనే తనిఖీ చేయాలని ఆయన ఆదేశించారు. సీట్లు కేటాయించని పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 3న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో 2047 ప్రణాళికపై సమీక్షించనున్నట్టు ఆయన వెల్లడించారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

లోపల సమావేశం.. బయట నిరసన

బొబ్బిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు రోజుకో రూపంలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత 8 రోజులుగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో ఉన్న సంగతి తెలిసిందే. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. లోపల సమావేశం జరుగుతున్న సమయంలో కార్మికులంతా కలసి హాలు ముందు ప్లకార్డులు ప్రదర్శించారు. కాసేపు మౌనంగానే నిరసన తెలిపి... సమ్మె శిబిరానికి వెనుదిరిగి వెళ్లిపోయారు.


మున్సిపల్ కౌన్సిల్ హాలు ముందు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

కదలవు.. వదలవు

- నాలుగు రోజులుగా ఒకేచోట ఏనుగుల తిష్ఠ

సీతంపేట రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో సంచరిస్తున్న గజరాజులు నాలుగు రోజులుగా చినబగ్గ సమీపంలోని కొండ ప్రాంతంలో తిష్ఠ వేశాయి. పగలంతా చెట్ల కింద సేదదీరుతున్న ఏనుగులు... సాయంత్రానికి జీడి, మామిడి తోటల్లో సంచరిస్తున్నాయి. కొండ ప్రాంతలో లభించే అరటి, పనస పండ్లను ఆరగిస్తూ... అక్కడే ఉండిపోతున్నాయి. ఈ నాలుగు ఏనుగుల గుంపు వల్ల ఇప్పటి వరకు పెద్దగా పంట నష్టం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవ్వడంతో గిరిజన రైతులు దుక్కులు, విత్తనాలు నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. చినబగ్గ సమీపంలోని కొండ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తుండడంతో వ్యవసాయ పనులకు వెళ్లడానికి భయపడుతున్నారు. ఏ క్షణాన ఏనుగులు తమపై దాడి చేస్తాయోననే భయం గిరిజన రైతులను వెంటాడుతోంది.


చినబగ్గ సమీపంలో సంచరిస్తున్న గజరాజులు

బాడీ బిల్డింగ్‌లో మెరిసిన రమేష్

బొబ్బిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని అగురువీధికి చెందిన బొండపల్లి రమేష్ అనే యువకుడు బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. జాతీయ స్థాయిలో జరిగిన క్లాసిక్ ఫిజిక్‌లో నాలుగో స్థానం, మెన్స్ ఫిజిక్‌లో ఐదో స్థానంలో నిలిచాడు. రమేష్ స్థానిక రాజా కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఢిల్లీలోని నరేష్ సూర్య క్లాసిక్ సంస్థ ఆదివారం నిర్వహించిన జూనియర్ క్లాసిక్ 65 కిలోల కేటగిరీలో ఏపీ తరఫున పాల్గొని బహుమతులు సాధించాడు. స్థానికంగా ఓ జిమ్‌లో ట్రైనర్‌గా పని చేస్తూనే బాడీ బిల్డింగ్‌లో రాణించేందుకు ప్రయత్నిస్తున్నాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన రమేష్‌ను స్థానికులు అభినందించారు.


ఢిల్లీలో పతకాలు అందుకుంటున్న రమేష్

జగన్నాథుడికి ఘనంగా పూజలు

జగన్నాథ స్వామి ఉత్సవాలను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామి వారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. సోమవారం వరాహ, నరసింహ, కూర్మావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

-ఆంధ్రజ్యోతి బృందం


పార్వతీపురం టౌన్: వరాహావతారంలో జగన్నాథుడు


జియ్యమ్మవలస: చినమేరంగిలో...


పాలకొండ: కూర్మావతారంలో..


శృంగవరపుకోట రూరల్: పూజల్లో పాల్గొన్న భక్తులు

చిత్రజ్యోతి

SINCE 1965



లుంగీ కట్టు.. మాస్ లుక్!

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.



పూజతో ప్రారంభం

తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

- శ్రీరామ్ వేణు



"'తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.